క్లుప్తంగా

వైభవం.. శ్రీకృష్ణ గ్రామోత్సవం



శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న గ్రామస్తులు

బత్తలపల్లి: మాల్యవంతంలో శ్రీకృష్ణుడి గ్రామోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మవృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని కోలాటం, భజనల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీఓ నరసింహనాయుడు, ఈఓఆర్డీ క్రిష్టప్ప హాజరై పల్లకీ సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక మాల్యవంతం కమిటీ అధ్యక్షులు మాలపాటి సూర్యనారాయణ, సభ్యులు పత్తిపాటి రంగానాయుడు, బాలిరెడ్డి, సాయి కిరణ్, గోనుగుంట్ల లోకేష్, కుంటాల సూరీ, లక్ష్మీనారాయణ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

మందులతో టీబీ నయం

బత్తలపల్లి: క్రమం తప్పకుండా మందులు వాడటంతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే టీబీ త్వరగా నయమవుతుందని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం పీహెచ్‌సీలో ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత మందులతో పాటు ఉచిత పోషకాహార కిట్లు అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, సూపర్‌వైజర్లు అశ్వర్థ నారాయణ, గౌరమ్మ, ఫార్మాసిస్ట్ సరస్వతి, జిల్లా టీబీ ల్యాబ్ సూపర్‌వైజర్స్ ఎరికలప్ప, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల నిరసన



ఆందోళన చేస్తున్న దివ్యాంగులు

తలుపుల: దివ్యాంగులు సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వైకల్య ధ్రువపత్రాల పరిశీలనలో వైద్యులు తక్కువ వైకల్య శాతాలు వేసి తమకు తీరని అన్యాయం చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ ఉన్న దివ్యాంగులందరికీ పింఛన్ అందించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీరికి సీపీఐ నాయకులు మద్దతు తెలిపి.. కొన్నేళ్లుగా తీసుకుంటున్న పింఛన్లను నిలుపుదల చేయకుండా కొనసాగించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ తాజుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వికలాంగుల సంఘం నాయకులు శ్రీరాములు, శ్రీనివాసులు, సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, సిద్దయ్య వివిధ గ్రామాల దివ్యాంగులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



పేదలతో కలిసి ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కదిరి టౌన్: అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తొలుత కదిరి పట్టణం సైదాపురం సర్వే నంబర్ 294, కదిరి మండలం రూరల్ పొలం సర్వే నంబర్ 720లో గుడిసెలు వేసుకున్న నిరుపేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ ఎల్‌ఐసీ కార్యాలయం రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి ర్యాలీగా బయల్దేరి పూలే సర్కిల్, నిజాంవలి సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. నాయకులు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి జగన్మోహన్, నాయకులు సాంబశివ, బాబ్జాన్, రామ్మోహన్, నాగేశ్వర్, దివాకర్, అమ్ములు, అమ్మాజాన్, యాస్మిన్, గాయత్రి, పార్వతమ్మ, ప్రీతి, కాంతమ్మ, భారతి, సరస్వతి, లక్ష్మీదేవి, మాబున్నీసా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కదిరి విద్యార్థికి కరాటేలో సిల్వర్ మెడల్



మనీష్‌కుమార్

కదిరి టౌన్: ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ తైక్వాండో పోటీల్లో అండర్-17 (38 కేజీల విభాగం)లో కదిరికి చెందిన సీవీ మనీష్‌కుమార్ ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ శ్రీనివాసులు తెలిపారు. జాతీయస్థాయి పోటీలు సెప్టెంబర్‌లో గ్వాలియర్‌లో జరగనున్నట్లు వెల్లడించారు.

మట్టి ప్రతిమలే మేలు

- రేపటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు

పుట్టపర్తి/ ధర్మవరం అర్బన్: వినాయక చవితి వచ్చిందంటే ప్రతి ఇంట్లో, వీధుల్లో గణపతి ప్రతిమలు వెలుస్తాయి. పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో వినాయక చవిత ఎంతో ఉల్లాసంగా, ఉత్సాహంగా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. గణపతి విగ్రహాలు వీలైనంత మేరకు మట్టితో చేసినవి ప్రతిష్టిస్తే మంచిదని, గణపతులకు అందుబాటులో ఉన్న పుష్పాలు,పత్రాలను పూజలకు వాడితే బాగుంటుందని, ఇలా ప్రకతి సహజమైనవి వాడటం వలన పర్యావరణం దెబ్బతినకుండా కాపాడినవారవుతారని పలువురు పర్యావరణ శాస్త్ర వేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

గణనాథుడే .. నాయకుడు

గణేశ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా ముస్తాబవుతోంది. బుధవారం నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గణనాథులకు స్వాగతం పలికేందుకు యువత ఉత్సాహంగా ఉంది. వినాయకుడు ఆది దేవుడు.. ఆశయసిద్ధి కోసం కొలిచే దైవం.. విఘ్నాలను తొలగించే దైవం.. ముఖ్యంగా గణపతి ఉత్సవాల్లో పిల్లలు, యువతదే అధిక సందడి. తొమ్మిదిరోజులు, ఐదు రోజులు, మూడురోజులపాటు భక్తితో పూజలు అందుకునే గణనాథుడ్ని చిత్తశుద్ధితో పరిశీలిస్తే రూపురేఖలు, గుణగణాలు, వ్రత విధానంలో యువత నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవచ్చు. వ్యక్తిత్వ వికాసం పొందవచ్చు.



మట్టి గణపతులను చేస్తున్న దృశ్యం

కాలుష్యాన్ని నివారించాలి



వినాయక చవితి సందర్భంగా ప్రతి వీధిలోనూ గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసుకుంటారు. అయితే మట్టి గణపతి ప్రతిమలు ఏర్పాటు చేసుకుంటే మంచిది. ఇదే క్రమంలో అందుబాటులో ఉండే పత్రాలను పూజకు వినియోగించుకోవాలి. ప్లాస్టిక్ లాంటి వస్తువుల వాడకం పూర్తిగా తగ్గించాలి. ఇలా చేయటం వల్ల కాలుష్యాన్ని నివారించవచ్చు.

– ఎస్.నారాయణరెడ్డి, కృష్ణదేవరాయలు ఉద్యానవన కళాశాల డీన్, అనంతపురం

ప్రకృతిలో లభించే పత్రాలు ఉపయోగించాలి



ప్రజలు వినాయ చవితి పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారు. ఈ సందర్భంగా మట్టి విగ్రహాల ఏర్పాటుతో పాటు అలంకరణకు ప్లాస్టిక్ ఇతర సామగ్రి వాడకుండా అందుబాటులో ఉన్న పత్రాలను, పుష్పాలను వాడుకోవాలి. ఇలా చేయటం వలన పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది.

– నాగిరెడ్డి, పర్యావరణ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, కృష్ణదేవరాయ ఉద్యానవన కళాశాల అనంతపురం

హుండీ లెక్కింపు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

నల్లచెరువు: పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాసం సందర్భంగా స్వామివారికి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను సోమవారం లెక్కించినట్లు ఈఓ మురళీకృష్ణ తెలిపారు. కానుకల ద్వారా రూ.6.65 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో తనిఖీ అధికారి ఎన్ ప్రసాద్, ప్రధాన అర్చకులు నాగరాజు, ఆంజనేయ దాస్, సంజీవు, రెడ్డెప్ప, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ'

తాడిమర్రి: మండల కేంద్రం తాడిమర్రిలో మంగళవారం 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి స్వగృహంలో జరగనున్న కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు జిల్లా నుంచి పలువురు విద్యార్థులు ఎంపికైనట్లు జిల్లా ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ అధికారి చెన్నకేశవప్రసాద్ తెలిపారు. ఇటీవల ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల మేరకు హెచ్‌ఐవీ/ ఎయిడ్స్, సుఖవ్యాధులు, కౌమార ఆరోగ్యం, డ్రగ్స్ వాడకంతో అనర్థాలు అనే అంశాలపై అవగాహన పెంపొందించడానికి కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. అందులో హిందూపురం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాల విద్యార్థిని భావన, షబ్రీన్ ప్రథమ, పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిజాముద్దీన్ బాబా, షబ్రీన్ తాజ్ ద్వితీయ, తలుపుల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఖాదర్‌బాషా, బాబురెడ్డి తృతీయ స్థానాల్లో నిలిచారన్నారు. వీరిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఇద్దరు విద్యార్థులను ఈ నెల 26న విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ మేరకు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను సోమవారం కొత్తచెరువులో అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ రమణ, మురళి, టీబీ కోఆర్డినేటర్ నాగేంద్ర, ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, నోడలాఫీసర్ సంజీవరెడ్డి, జనజాగృతి సంస్థ మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ 'కూటమి' మోసాలు వివరించండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్

బత్తలపల్లి: ఎన్నికల హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రమైన బత్తలపల్లిలోని గుండా కళ్యాణమండపంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాసపల్లి సాయికుమార్, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటి సురేష్‌కుమార్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి చెలిమి రామయ్య, జిల్లా కార్యదర్శి ప్రభాకరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలోని కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదని ధ్వజమెత్తారు. ఉచిత బస్సు పథకంలో ఆంక్షలు విధిస్తూ మహిళలను తీవ్రంగా మోసగించారన్నారు. నాలుగున్నర లక్షల మంది పింఛన్లు తొలగించేందుకు రంగం సిద్ధం చేశారని మండిపడ్డారు.

గత ప్రభుత్వంలో ప్రతి నెలా 25వ తేదీ వరకు రేషన్ పంపిణీ జరిగేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం 4వ తేదీకే 'నో స్టాక్' బోర్డు పెట్టి ప్రజలకు అన్యాయం చేస్తోందన్నారు. అనంతరం 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మట్టి గణపతుల పంపిణీ



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న అవోపా సభ్యులు

ధర్మవరం అర్బన్: అవోపా (ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పాండురంగస్వామి ఆలయం వద్ద మట్టి గణపతులను పంపిణీ చేశారు. అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జ్ అన్నా లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షులు శీబా నగేష్‌గుప్తా మాట్లాడుతూ వినాయక చవితి పండుగకు ప్రతిఒక్కరూ మట్టి గణపతులను ఉపయోగించి పర్యావరణాన్ని రక్షించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బీవీ సుబ్బారావు, వాసవి మహిళా మండలి అధ్యక్షురాలు రూపా రాగిణి, అవోపా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ లేకుంటే పేదలు రోడ్డుపాలే

తాడిమర్రి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఆర్డీటీ సేవలు నిలిచిపోతే పేద కుటుంబాలు రోడ్డుపాలవుతాయని ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య పేర్కొన్నారు. తాడిమర్రిలో ఆర్డీటీ స్వయం సహాయక మహిళా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ర్యాలీలో ఆయన సీపీఐ, దాని అనుబంధ సంఘం నాయకులు, కార్యకర్తలతో కలసి పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం తహసీల్దార్ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీడీసీ నారాయణ స్వామి, సీబీటీలు రామకృష్ణ, సుదర్శనం, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, సీపీఐ నాయకులు బండల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

తలుపుల : వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హోమియోపతి వైద్యులు లక్ష్మీనరసయ్య సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని శ్రీసాయి ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో కరస్పాండెంట్ టి.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పిల్లలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం హోమియో మందులను అందించారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోండి



వినాయక ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం అర్బన్: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా చేసుకోవాలని డీఎస్పీ హేమంత్‌కుమార్ సూచించారు. పట్టణంలోని శ్రీ షిరిడిసాయిబాబా కళ్యాణ మండపంలో సోమవారం వినాయక ఉత్సవ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే రోజు నుంచి నిమజ్జనం చేసే వరకు పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వహణ మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని క్యూఆర్ కోడ్ పొందాలని తెలిపారు. లౌడ్ స్పీకర్లు రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు వినియోగించరాదన్నారు. ఇతర మతస్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ఆయా వార్డుల్లో మండపం నిర్వాహకులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ నాగేంద్ర ప్రసాద్, బీజేపీ నాయకులు హరీష్, అంబటి సతీష్, డోలా రాజారెడ్డి, గిర్రాజు నగేష్, గుండా పుల్లయ్య, విశ్వహిందూ పరిషత్ సభ్యులు వేణుగోపాల్, సాకే ఓబిలేసు, జింకా చంద్రశేఖర్, శంకర్ చంద్రశేఖర్, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నల్లచెరువు: వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్‌ఐ మక్బూల్ బాషాష సూచించారు. నల్లచెరువు పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్ జమానుల్లా ఖాన్, ఎంపీడీఓ రఘునాథ గుప్తాతో కలిసి పలు గ్రామాల ప్రజలతో సోమవారం సమావేశం నిర్వహించారు.

పుట్టపర్తి టౌన్: సబ్ డివిజన్ పరిధిలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా, మత ఘర్షణలు లేకుండా పార్టీలకు అతీతంగా గణేశ్ ఉత్సవాలు నిర్వహించుకోవాలని పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్ పీస్ కమిటీ కమీటీ సభ్యులకు సూచించారు. సోమవారం సాయి ఆరామంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల పీస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి.. ఉత్సవాల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు.

తనకల్లు: వినాయక చవితి సందర్భంగా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలంటే పోలీసుల అనుమతిని తప్పనిసరి అని ఎస్‌ఐ గోపి తెలిపారు. తనకల్లు పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.

కదిరి అర్బన్: పట్టణంలోని పోలీస్ గెస్ట్ హౌస్‌లో సోమవారం డీఎస్పీ శివనారాయణస్వామి రూరల్ అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డితో కలిసి కదిరి మండలంలో గణేష్ మంటప నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు.

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా వినాయక విగ్రహల మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని డీఎస్పీ శివనారాయణ స్వామి తెలిపారు. గాండ్లపెంట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మత పెద్దలు, రాజకీయ నాయకులతో శాంతి సమావేశం నిర్వహించారు. ప్రశాంతంగా పండుగ నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీతో పాటు రూరల్ సీఐ నాగేంద్ర, శిక్షణ ఎస్‌ఐ రవికుమార్, తహసీల్దార్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

భూహక్కు పత్రాలు చూసి పాస్‌బుక్‌లు ఇవ్వండి



ఆర్డీఓ కార్యాలయం వద్ద అర్జీలు చూపుతున్న రైతులు

పుట్టపర్తి టౌన్: భూహక్కు పత్రాలు చూసి పాసు పుస్తకాలు ఇవ్వాలని బడవాండ్లపల్లి, అరవాండ్లపల్లి రైతులు ఆర్డీఓ సువర్ణను కోరారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యాక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ సువర్ణను కలసి సమస్యను విన్నవించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నల్లమాడ పొలం బడవాండ్లపల్లి, అరవాండ్లపల్లి తండాలో ఉన్న సర్వే నంబర్ 589 నుంచి 1038 సర్వేనంబర్ వరకు 170 ఎకరాల్లో 3వ వంతు భూమి తమకు రావాల్సి ఉందన్నారు. గతంలో ఎర్రపరెడ్డి, గొర్ల గంగిరెడ్డి ఇరువురు 1965లో భూమని అమ్మారని చెప్పారు. అయితే వారి వారసులు నాగమ్మ, గంగులమ్మ కోర్టుకు వెళ్లగా.. అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. దీని ఆధారంగా పాసుపుస్తకాలు మంజూరు చేయాలని ఐదేళ్లుగా తిరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. భూమి పరిశీలనకు వచ్చిన ఆర్డీఓ తమవద్దనున్న ఆర్డర్ కాపీ చూడకుండా.. ఆ భూములు గిరిజనులవని చెప్పడం దారుణమన్నారు. తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు రవీంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గంగిరెడ్డి, లక్ష్మీదేవమ్మ, కాంతమ్మ, ఈశ్వర్‌రెడ్డి, బాలిరెడ్డి, వారాధిరెడ్డి, అంజినమ్మ కోరారు.

మున్సిపల్ గదుల వేలం పాటకు స్పందన

ధర్మవరం: మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న రూమ్‌లకు నిర్వహించిన వేలంపాటకు మంచి స్పందన వచ్చిందని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ తెలిపారు. కళాజ్యోతి సర్కిల్‌లో నూతనంగా నిర్మించిన శ్రీమాలగుండ్ల పెదయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని ఖాళీ రూమ్‌లు, కూరగాయల మార్కెట్‌లోని కమర్షియల్ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని రూమ్‌లకు, షెడ్‌లకు గుడ్‌విల్, నెలవారీ అద్దె ప్రాతిపదికన సోమవారం మున్సిపల్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. కళాజ్యోతి సర్కిల్‌లోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో నున్న ఒకటో నంబర్ షాప్‌కు ఎం.అమర్‌నాథ్ రూ.10,25,000, 11వ నంబర్ షాప్‌కు ఎం.గోవిందు రూ.5,33,000 గుడ్‌విల్ పద్ధతిపై వేలం దక్కించుకున్నారు. కూరగాయల మార్కెట్‌లో నెలవారీ అద్దె పద్ధతిపై షెడ్ -106కు ఎస్.సాలమ్మ రూ.2,100, షెడ్- 114కు పి.పార్వతి రూ.2,100, షెడ్- 138కు బెస్త లక్ష్మీనారాయణమ్మ రూ.2,100, షెడ్- 148కు బెస్త శంకర్ రూ.1,200 చొప్పున వేలం దక్కించుకున్నారు.

ఒకే వార్డులో ముగ్గురికి పీఈటీ పోస్టులు



పోస్టులకు ఎంపికైన యువకులతో పీడీ నాగేంద్ర

ధర్మవరం అర్బన్: పట్టణంలోని 40వ వార్డు గుట్టకిందపల్లికి చెందిన ముగ్గురు యువకులకు డీఎస్సీలో పీఈటీ (వ్యాయామ ఉపాధ్యాయ) పోస్టులు దక్కాయి. కె.నాగార్జున 16వ ర్యాంకు, గవ్వల మల్లేసు 18వ ర్యాంకు, డి.ప్రతాప్ 28వ ర్యాంకుతో పోస్టులకు ఎంపికయ్యారు. ఒకే వార్డులో ముగ్గురు యువకులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం హర్షణీయమని అదే వార్డుకు చెందిన పీడీ నాగేంద్ర, వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీటీఎఫ్ పట్టణాధ్యక్షుడిగా గోపి



ఎంపికైన గోపి, నాగప్ప, అంజి నాయక్

ధర్మవరం: ఏపీటీఎఫ్ పట్టణాధ్యక్షుడిగా నల్లజాల గోపి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం సర్వసభ్య సమావేశం నిర్వహించిన అనంతరం ఏపీటీఎఫ్ ఎన్నికల అధికారి సానే రవీంద్రరెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనంకి అశోక్‌కుమార్, బీకే ముత్యాలప్ప, బలరాముడుల ఆధ్వర్యంలో పట్టణ శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడుగా నల్లజాల గోపి, గౌరవాధ్యక్షుడుగా జెన్నే నాగప్ప, ప్రధాన కార్యదర్శిగా ఎం.అంజినాయక్, ఉపాధ్యక్షులుగా నాగభూషణ, నాగశేఖర్, శిరీష, చెన్నుడు, రామంజినేయులు, కార్యదర్శులుగా బషీర్ అహ్మద్, విజయ్‌కుమార్, దుర్గా, కాంతమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా ఉమాపతి, అమానుల్లా, ఓబిలేసు, కృష్ణవేణి, జగదీష్, వెంకటరమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా శేఖర్ ఎన్నికయ్యారు.

నేత్రదానంతో అంధులకు వెలుగు

తాడిమర్రి: మరణించిన వ్యక్తుల నేత్ర దానంతో ఇద్దరు అంధులకు కంటి వెలుగు ఇవ్వొచ్చని జిల్లా అంధత్వ నివారణ సంస్థ అధికారి డాక్టర్ అనూరాధ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి హరిత అధ్యక్షతన సోమవారం జరిగిన నేత్రదాన పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో నేత్రదానం చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు మల్లప్పగారి నాగిరెడ్డి సతీమణి నాగలక్ష్మమ్మను వైద్యాధికారులు సన్మానించారు. డాక్టర్ గోవర్ధన్ నాయుడు, ఆప్తాలమిక్ అధికారి ఉరుకుందప్ప, హెల్త్ సూపర్‌వైజర్ రామ్‌కుమార్, పీహెచ్‌ఎం లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేత్ర, రక్తదానం ఎంతో గొప్పవి

ధర్మవరం అర్బన్: దానాలలో నేత్రదానం, రక్తదానం ఎంతో గొప్పవని కంటి వైద్యాధికారి నరసింహులు తెలిపారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో సోమవారం జాతీయ నేత్రదాన పక్షోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి ఆయన కరపత్రాలు విడుదల చేశారు. రోటరీక్లబ్, యువర్స్ ఫౌండేషన్, విశ్వదీప సేవా సంఘం, లయన్స్‌క్లబ్, విభిన్న ప్రతిభావంతుల సంఘం, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సురవరానికి ఘన నివాళి

ఓడీచెరువు: సీపీఐ నేత సురవరం సుధాకర్‌రెడ్డికి మండల నాయకులు సోమవారం ఓడీచెరువులో ఘనంగా నివాళులర్పించారు. సీనియర్ నాయకులు పూల శ్రీనివాసులు మాట్లాడుతూ సురవరం మరణం సీపీఐకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చలపతినాయుడు, సహాయ కార్యదర్శులు రవికుమార్, సుధాకర్, నాయకులు రత్నబాయి, లక్ష్మీదేవి, ఎల్లప్ప, సింగన్న పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లిలో రామన్నకోట గణపతి విగ్రహ ప్రతిష్ఠకు వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 20 వేలు విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని సోదరుడు డాక్టర్ రాంప్రసాద్ చేతుల మీదుగా గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు.

29న మాతృభాషా దినోత్సవ వేడుకలు

ధర్మవరం: పట్టణంలోని కళాజ్యోతిలో ఈ నెల 29న మాతృభాషా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కళాజ్యోతి కార్యదర్శి బాలగొండ్ల రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు మాతృభాషా దినోత్సవ వేడుకలకు సభాధ్యక్షులుగా కళాజ్యోతి అధ్యక్షుడు కుంటిమల నారాయణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా అనంతపురం జనప్రియ కవి ఏలూరు యంగన్న హాజరుకానున్నారని తెలిపారు. ప్రముఖ నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ గురుకృప సంగీత నృత్య కళానికేతన్ విద్యార్థులతో కూచిపూడి నృత్య వైభవం, జానపద నృత్యాలు ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. 29న సాయంత్రం 6.30 గంటలకు కళాజ్యోతిలో జరిగే తెలుగు మాతృభాషా దినోత్సవానికి ప్రతిఒక్కరూ తరలిరావాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలోని జౌకల ఆటో స్టాండ్ వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకెళితే.. గాండ్లపెంట నుంచి గాలివీడుకు వెళుతున్న కారు కదిరి – రాయచోటి ప్రధాన రహదారిపై అధిక సంఖ్యలో వాహనాలు నిలిచి ఉండటంతో వాటిని తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు హరి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

కదిరి టౌన్: మున్సిపల్ పారిశుధ్య కార్మికులుగా పనిచేసి మరణించిన, రిటైర్డు అయిన వారి కుటుంబాల్లోని వారికి కారుణ్య నియామకం కింద ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఐటీయూ నాయకులు సోమవారం మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, రామ్మోహన్, జనార్దన, తిరుపాల్, బాలక్రిష్ణ, నరసింహమూర్తి, శ్రీనివాసులు, లక్ష్మన్న, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లాక్కుని పరారీ

తనకల్లు: ద్విచక్రవాహనదారుడిని ఏమార్చి సెల్‌ఫోన్‌ను లాక్కుని దుండగులు పరారయ్యారు. వివరాలిలా ఉన్నాయి. ఎగువ తొట్టిపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి సోమవారం సరుకుల కోసం ద్విచక్రవాహనంపై తనకల్లుకు వచ్చాడు. సరుకులు తీసుకున్నాక స్వగ్రామానికి బయల్దేరాడు. మార్గం మధ్యంలో గుర్తు తెలియని వ్యక్తులు బండికి ఏదో తగులుకుందని చెప్పడంతో గోపాల్‌రెడ్డి బైక్ ఆపాడు. అలా వెనక్కు తిరిగి చూసుకునేలోపు ఆ వ్యక్తులు గోపాల్‌రెడ్డి సెల్‌ఫోన్ లాక్కుని ఉడాయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.